క్లుప్తంగా

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి కూకట్‌పల్లి మండలంలోని పలువురు లబ్ధిదారులకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బుధవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12 మంది లబ్ధిదారులకు చెందిన సుమారు 12 లక్షల ఆర్థిక సాయం మంజూరైందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, పురేందర్ రెడ్డి, అష్రఫ్, లబ్ధిదారులు, మహిళలు, పాల్గొన్నారు.

రంగధాముని చెరువుపై బాంబు స్క్వాడ్ తనిఖీ



మూసాపేట: వినాయక నిమజ్జనం సందర్భంగా కూకట్‌పల్లి ఐడీఎల్ రంగధాముని చెరువు కట్టపై పోలీసులు బుధవారం సాయంత్రం బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. భక్తుల భద్రతకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు.

'మహీంద్ర యూనివర్సిటీపై చర్యలు తీసుకోవాలి'

దుండిగల్: బహదూర్‌పల్లిలోని మహీంద్ర యూనివర్సిటీలో డ్రగ్స్ సేవిస్తూ ఆరుగురు విద్యార్థులు పట్టుబడిన ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేయాలని కోరుతూ ఏబీవీపీ కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ నగేశ్ దుండిగల్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ కేసులో ఆరుగురు విద్యార్థులకు పాజిటివ్ వచ్చినా యూనివర్సిటీ యాజమాన్యం ఇంతవరకు స్పందించడం లేదని ఆరోపించారు. సెక్యూరిటీ లోపించడంతో డ్రగ్స్ దందా, వాడకం కొనసాగుతోందని, యూనివర్సిటీ యాజమాన్యం నిర్వాకంతో విద్యార్థులు డ్రగ్స్ బారిన పడుతున్నారని, దీనిపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టి దోషులకు శిక్ష పడేలా చూడాలన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నగేశ్



వివేకానందనగర్‌లో పూజలు చేసిన ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు



కేపీహెచ్‌బీ డివిజన్‌లో కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ఎమ్మెల్యే గాంధీ తదితరులు



భరత్‌నగర్ కాలనీ కూరగాయల మార్కెట్ వద్ద ..

దండాలయ్యా ఉండ్రాళ్లయ్యా

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో వినాయక నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పలు మండపాల్లోని గణనాథులను ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు, పార్టీల నాయకులు, అసోసియేషన్ సభ్యులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు. -కూకట్‌పల్లి, జోన్ బృందం



అంజయ్యనగర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సెవెన్‌హిల్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ..



అయోధ్య సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆకారంలో మండపం



బాలనగర్‌లోని గోల్డెన్ బాయ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



గాయత్రీనగర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ..



ఆంజనేయనగర్‌లో పూజల్లో కాలనీవాసులు



దయార్‌గూడలో అన్నదానం..



ఆదిత్యనగర్‌లో బీఆర్ఎస్ నాయకుడు సతీశ్‌రావు, మహిళా సంఘం నాయకురాళ్లు



కూకట్‌పల్లిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంగళరావు..



అల్లాపూర్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం తదితరులు

భవిష్యత్ కార్యాచరణపై విద్యార్థుల చూపు

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్సీ కవిత భవిష్యత్ కార్యాచరణపై ఓయూ విద్యార్థి నేతలు వేచిచూస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అనేక మంది విద్యార్థి నాయకులు రాజకీయ, అధికార పదవుల అవకాశాల కోసం ఎదురుచూస్తున్న విషయం విధితమే. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సుమారు 13 మందికి అవకాశాలు లభించగా, కాంగ్రెస్ పాలనలో కేవలం ముగ్గురికి మాత్రమే అధికార పదవులు దక్కాయి. దీంతో 12 ఏళ్లుగా సుమారు 30 మంది విద్యార్థి నాయకులు అవకాశాల కోసం వివిధ పార్టీల్లో తృతీయ శేణి నాయకులుగా చలామణి అవుతూ సీనియర్ నేతలకు అనుచరులుగా తిరుగుతున్నారు. కవిత కొత్త పార్టీ పెడితే ఓయూ నుంచి విద్యార్థి నేతలు చేరే అవకాశాలు ఉన్నాయని తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థి నాయకులు పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీలు, ఇంజినీరింగ్ కాలేజీల్లో మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఓయూలో ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దే విద్యార్థులు మత్తుకు బానిసలవ్వడం దురదృష్టకరమన్నారు. కొన్ని ప్రైవేట్ వర్సిటీల్లో విద్యార్థులు డ్రగ్స్‌తో పట్టుపడటం బాధకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్‌పై ఇది తీవ్రప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్ నియంత్రణకు ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్సును పెంచి మత్తుపదార్థాల విక్రయాలను పూర్తిగా నియంత్రించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

వినాయక నిమజ్జనాల సందడి

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువులో బుధవారం వరకు 9,575 వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యాయని అధికారులు తెలిపారు. మొదటి రోజు 37, రెండో రోజు 358, మూడో రోజు 559, నాలుగో రోజు 2953, ఐదో రోజు 3719, ఆరో రోజు 1304, ఏడో రోజు 595, ఎనిమిదో రోజు 50 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారని అధికారులు పేర్కొన్నారు.
గురువారం 9వ రోజు, శనివారం సామూహిక వినాయక విగ్రహాల నిమజ్జనం చివరి రోజు కావడంతో ఎక్కువ విగ్రహాలు వస్తాయని తెలిపారు.

ముగిసిన మాతృభాష వారోత్సవాలు

నిజాంపేట్: నిజాంపేట్ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గత నెల 28న ప్రారంభమైన మాతృ భాష వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా 4, 5వ తరగతుల విద్యార్థులకు సుమతీ శతకం, వేమన శతకం పద్యాల పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్.ప్రభావతి, సంస్థ కార్యదర్శి అప్పాజీ శ్రీనివాసు విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాతృమూర్తిని, మాతృభాషను, మాతృదేశాన్ని, మాతృధర్మాన్ని ప్రేమిస్తూ, పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రథమ బహుమతి ఎస్.ధాన్యశ్రీ, ద్వితీయ బహుమతి సీహెచ్.కార్తీక్, తృతీయ బహుమతి ఎస్.శ్రీనిధి, ఏ.ఆరాధ్య, పి.ధనుష్, డి.ధనుశ్రేయ్, తేజ్ కుమార్ బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో హేమశ్రీ, తనూజాశ్రీ, లక్షన్యాయ విజేతలుగా నిలిచారు. ఉపాధ్యాయులు టి.రామతులసీ, మంజులత, తార, పుష్పలత, శాంతి తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు

గంజాయి విక్రేతల అరెస్ట్

1.023 కిలోల గంజాయి, 94.2 గ్రాముల చరస్ స్వాధీనం

చందానగర్ : శేరిలింగంపల్లి మండలం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో గంజాయి, చరస్‌లు విక్రయిస్తున్న ఇద్దరిని బుధవారం శంషాబాద్ ఎస్టీఎఫ్, డీటీఎఫ్ టీమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు...ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన జోగి వంశీకృష్ణ (27) హిమాచల్ ప్రదేశ్‌లో వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో 94.2 గ్రాముల చరస్ తీసుకొని వచ్చి మియాపూర్ హఫీజ్‌పేట్ ప్రాంతంలో విక్రయిస్తుండగా ఎస్టీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గంజాయి విక్రయిస్తూ....

జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ మండలంకు చెందిన జె.సంతోష్ అలియాస్ శర్మ (23) కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ నుంచి 1.023 కిలోల గంజాయి తీసుకొని వచ్చి మాదాపూర్, చందానగర్ పరిసర ప్రాంతాలలో విక్రయిస్తుండగా డీటీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 1.023 కిలోల గంజాయి, స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మహా నిమజ్జనానికి సర్వం సిద్ధం

- 17 చెరువుల్లో ఇప్పటి వరకు 33,477 విగ్రహాల నిమజ్జనం
- ప్రతి చెరువు వద్ద 2 క్రేన్లు, ఇద్దరు గజ ఈతగాళ్లు
- అన్ని వసతులు కల్పించామన్న కలెక్టర్ మనుచౌదరి



నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు, అధికారులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 17 చెరువుల వద్ద గణేష్ మహా నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించేలా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల వసతులను కల్పిస్తోంది. ఈనెల 27న గణనాథులు కొలువు దీరగా.. పదో రోజు 6న వినాయక నిమజ్జనానికి అధికారులు పకడ్బంది చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 2 వేల మంది పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అందుబాటులో 10 మంది సిబ్బంది..

ప్రతి చెరువు వద్ద రెండు క్రేన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇద్దరు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. చెరువుల వద్ద విద్యుత్తు లైటింగ్, తాగునీటి వసతితో సహా 10 మంది సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పోలీసు పికెట్, మెడికల్ క్యాంపు, ఫైర్ ఇంజిన్, విద్యుత్ సౌకర్యాలను కల్పించారు. భక్తులకు టాయిలెట్లు, టాయిలెట్లు సహా కనీస వసతులను ఏర్పాటు చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని చెరువుల వద్ద భారీకేడ్లు ఏర్పాటు చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా..

రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వినాయక నిమజ్జనం కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 17 చెరువుల వద్ద ప్రత్యేక అధికారులుగా మున్సిపల్ కమిషనర్లు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లకు జిల్లా కలెక్టర్ మనుచౌదరి బాధ్యతలను అప్పగించారు. నిమజ్జన ప్రాంతాలలోని చెరువులను జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు, డీఆర్ఓ, ఆర్డీఓలు, స్పెషల్ ఆఫీసర్లు నిరంతరంగా పర్యవేక్షిస్తున్నారు.

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 17 చెరువుల్లో జీహెచ్ఎంసీ పరిధిలో 11 ఉండగా.. మిగతా ఆరు చెరువులు పురపాలక సంఘాల పరిధిలో ఉన్నాయి.
- జిల్లా వ్యాప్తంగా మూడు ఫీట్ల నుంచి మొదలుకుని 5 ఫీట్లకు పైగా ఉన్న వినాయక విగ్రహాలు దాదాపు 38,775 ప్రతిష్ఠించినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. భక్తులకు అన్ని రకాల వసతులు కల్పించామని, 19 చోట్ల మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు వివరించారు.
- 8వ రోజు బుధవారం నాటికి నిర్దేశించిన చెరువుల్లో భక్తులు 33,477 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. గతేడాది వినాయక ఉత్సవాల్లో భాగంగా 17 చెరువుల్లో 36,456 వినాయక విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేశారు.
- 5 ఫీట్లకు పైన ఉన్న వినాయక విగ్రహాలు 11,558 ఉండగా.. ఐదు ఫీట్ల కంటే తక్కువగా 24,898 విగ్రహాలు ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

చెరువుల వద్ద స్పెషల్ ఆఫీసర్లు వీరే..

గణేష్ నిమజ్జనానికి 17 చెరువుల్లో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం ప్రశాంతంగా జరిగేలా 17 మంది స్పెషల్ ఆఫీసర్లను నియమించింది. స్పెషల్ ఆఫీసర్లుగా వెంకట్‌గోపాల్–(సుతారిచెరువు), చంద్రప్రకాష్ –(పెద్దచెరువు), సాబేర్‌అలీ–(ప్రగతినగర్ ట్యాంకు), రాజు–(నల్లచెరువు), నర్సింహ–(వెన్నెలగడ్డ చెరువు), మల్లయ్య–(పరికి చెరువు), ఇస్లావత్ –(ఐడీఎల్ ట్యాంకు), గంగాధర్–(హస్మత్‌పేట్ బౌవెల్ చెరువు), స్వామి–(సున్నం చెరువు), ఎంఎస్ఆర్ జ్యోతి–(శామీర్‌పేట్ చెరువు), జాక్రియా సుల్తానా– (సఫిల్‌గూడ ట్యాంకు), శ్రీనివాస్‌రెడ్డి–(కొత్తచెరువు)లను కలెక్టర్ నియమించారు.

వాతావరణ సమతుల్యంలో సముద్రాలు కీలకం

ఏపీ విశ్రాంత చీఫ్ సెక్రెటరీ సుబ్రహ్మణ్యం



ఎల్‌వీ సుబ్రహ్మణ్యంను సన్మానించి జ్ఞాపికను అందిస్తున్న ఎస్కీ డైరెక్టర్ ,అతిథులు

రాయదుర్గం: వాతావరణ సమతుల్యంలో సముద్రాలు కీలకం అని, ప్రపంచంలో అతిపెద్ద పర్యావరణ వ్యవస్థగా ఉన్న మహాసముద్రాలను విధ్వంసం చేసే హక్కు ఎవరికీ లేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత చీఫ్ సెక్రెటరీ ఎస్‌వి సుబ్రహ్మణ్యం అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చమురు లీకేజీలతో ఏర్పడుతున్న సముద్ర కాలుష్యాన్ని నివారించడం అనే అంశంపై జరుగుతున్న రెండు రోజుల జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సముద్ర తీర ప్రాంతాల్లో నెలకొన్న అనేక పరిశ్రమల వ్యర్థాలు సముద్ర కాలుష్యాన్ని సృష్టిస్తున్నాయన్నారు. ప్రపంచంలోని మహా సముద్రాలు భూమి ఉపరితలంపై 71 శాతం సముద్రపు నీటితో ఆక్రమించబడి లక్షలాది సముద్ర జాతులకు నివాసంగా నిలిచి, అపారమైన జీవవైవిధ్యాన్ని పోషిస్తున్నాయని గుర్తు చేశారు. సముద్రాలు భూమి ఉపరితలంపై ఉన్న కార్బన్ డయాక్సైడ్, వేడిని తీసుకుంటూ వాతావరణ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తూ ఉన్నాయన్నారు. 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ రసాయనాలు, పురుగుమందులు, భారీ లోహాలు, పరిశ్రమల వ్యర్థాలు సముద్రాల్లో పేరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నివారణకు ప్రభుత్వాల కన్నా ప్రజలే బాధ్యతగా వ్యవహరిస్తే సముద్ర కాలుష్యం ఉండదన్నారు. క్లైమేట్ చేంజ్, పర్యావరణం, వాటర్ రిసోర్సెస్, పవర్ అండ్ ఎనర్జీ తదితర విషయాలపై ఇక నుంచీ ప్రతి యేటా ఎస్కీ క్యాంపస్‌లో పదివేల మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్‌జే ప్రసాద్, వెంకట్‌రెడ్డి, సెంటర్ ఫర్ క్లైమేట్ చేంజ్ హెడ్ డా.చంద్రకళ, ఫ్యాకల్టీ డాక్టర్ ఆది నరేష్, చీఫ్ లక్ష్మీకాంతరావు, డా.రాజారావు, ఇతర విభాగాల అధిపతులు, ఫ్యాకల్టీ, అధికారులు పాల్గొన్నారు.